## క్లుప్తంగా

### అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు కదిరి విద్యార్థులు


జనార్ధన


హర్షవర్ధన్‌రాజు

కదిరి అర్బన్: తమిళనాడులోని వేలూరులో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు అనంతపురం ఎస్కే యూనివర్శిటీ తరపున కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక య్యారు. హర్షవర్ధన్‌రాజు, జనార్ధన్ ఎస్కే యూనివర్శిటీలో జరిగిన అంతర్ కళాశాలల టీటీ పోటీల్లో విజేతలుగా నిలిచారు. తమ కళాశాల విద్యార్థులు అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, పీడీ నరసింహాచారిలు పేర్కొన్నారు.

### మెరుగైన వైద్యసేవలందించండి


వైద్యులకు సూచనలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డా.నాగేంద్ర

తలుపుల : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ నాగేంద్ర పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు, సిబ్బంది హాజరు తదితర అంశాలపై వైద్యాధికారులు అష్ఫాఖ్, అక్షితలతో ఆరా తీశారు. అనంతరం పెద్దన్నవారిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులు పరిశీలించి, వైద్యసేవలపై ఆరా తీసి వైద్యపరమైన సూచనలు చేశారు. డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, డీపీఓ నాగరాజు, బాబాఫక్రొద్దీన్, ఐడీఏస్‌పీ సుబ్బారావు ఉన్నారు.

### ఏఆర్ డీఎస్పీకి ఘన వీడ్కోలు


డీఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ సేవలు మరువలేనివని ఎస్పీ రత్న కొనియాడారు. ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ విజయవాడకు బదిలీపై వెళ్తుండటంతో శుక్రవారం డీపీఓలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో ఆయనను ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వక్తలు డీఎస్పీ విజయ్‌కుమార్ అందించిన సేవలను గుర్తు చేశారు. అడిషనల్ ఎస్పీ అర్ల శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు వలీ, మహేష్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, వీరన్న, ఏఆర్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోలీసులకు సన్మానం

ముదిగుబ్బ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు పని చేస్తూ బదిలీ అయిన పోలీసులు అశోక్, నరేష్, జనార్ధన్, మహేశ్వరెడ్డి తోటి సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీఐ శివరాముడు సిబ్బంది సేవలను కొనియాడారు.

# టమారా!

- వంట దిగుబడిపై తుపాన్ ప్రభావం
- వంటను చుట్టుముట్టిన తెగుళ్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


బందార్లపల్లిలో దెబ్బతిన్న టమాట తోట


తెగుళ్ల కారణంగా మచ్చలు ఏర్పడిన కాయలు

నల్లచెరువు: తుపాన్ ప్రభావంతో టమాట పంట తీవ్రంగా దెబ్బతినింది. కొన్ని రోజులుగా మేఘాలు ఆకాశాన్ని కప్పేస్తుండటంతో పంటకు నల్లమచ్చలు, ఊజీ తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాట ధరలు అధికంగా ఉన్నా తెగుళ్ల కారణంగా తోటలు దెబ్బతిన్నాయి. టమాట కోతల్లో వందకు 30–35 క్రేట్లు దెబ్బతిన్న కాయలే ఉంటున్నాయి. మార్కెట్లో ప్రస్తుతం 30 కేజీల క్రేట్ ధర రూ.1200 వరకూ పలుకుతోంది. కానీ తెగుళ్లబారిన పడిన పంట క్రేట్ రూ.200 మాత్రమే పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తగ్గిన దిగుబడి**

కదిరి డివిజన్ వ్యాప్తంగా రైతులు సుమారు 1250 ఎకరాల్లో టమాట సాగు చేశారు. వాతావరణ మార్పుల కారణంగా పంటకు తెగుళ్లు సోకి పంట దిగుబడి చాలా వరకూ తగ్గింది. గతంలో ఎకరానికి వెయ్యి క్రేట్లకు పైగా దిగుబడి వచ్చేది. అయితే ఇప్పటి వాతావరణ పరిస్థితులను బట్టి 500 నుంచి 700 క్రేట్లలోపే దిగుబడి వస్తోంది.

**మంచు, తుపాన్ ప్రభావంతో..**

ప్రస్తుతం వాతారవణ మార్పుల కారణంగా కురుస్తున్న మంచు, తుపాన్ ప్రభావంతో టమాట తోటలకు నల్లమచ్చలు, ఊజీ, గజ్జి తెగుళ్లు, ఆశించి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. తెగుళ్లతో చెట్టులోని కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు మచ్చలు ఏర్పడ్డాయి. కాయలు సైజు పెరిగే కొద్దీ మచ్చలు అలాగే ఉంటున్నాయి. దీంతో కొనే వారు ముందుకురాక మచ్చలు ఏర్పడిన కాయలకు డిమాండ్ లేకపోతుంది. మంచి కాపు మీద ఉన్న టమాట పంటలు కొద్ది రోజులుగా తుఫాను, మంచు ప్రభావంతో ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో తెగుళ్ల బారిన పడిన తోటల రూపురేఖలు మారిపోయాయి. కొన్నిచోట్ల పిందెలు, కాయలు రాలి కాలువల్లో పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తెగుళ్ల కాయలకు తక్కువ ధర**



మచ్చలకాయలకు మార్కెట్లో ధరలు లేవు మార్కెట్లో నల్లమచ్చలు తెగుళ్లు సోకిన టమాటకు ధరలు లేవు. నాణ్యమైన పంట ధర మాత్రం క్రేట్‌కు రూ.1200 వరకూ ధర పలుకుతోంది. మచ్చలు ఉన్న కాయలకు కేవలం రూ.200 మించి మార్కెట్లో తీసుకోవడంలేదు. పంట సాగుకు రైతుకు ఎకరానికి 80వేల వరకూ ఖర్చవుతోంది. ధర ఉన్నా రైతుకు ఎకరానికి రూ.50 వేలకు మించి ఆదాయం రావడంలేదు.

– గోవిందు, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

**తుపాన్ మంచుతో పంట నష్టం**



తుఫాను, మంచు వాతావరణ మార్పుల ప్రభావంతో తోటలు ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. పంట తెగుళ్ల బారిన పడిన తోటల రూపురేఖలే మారి పోయాయి. కొన్నిచోట్ల పిందెలు, కాయలు రాలి కాలువల్లో పడుతున్నాయి. దీంతో టమాట రైతులంతా తీవ్రంగా నష్టపోతున్నాం.

– మూడే శంకర్‌నాయక్, బందార్లపల్లి, నల్లచెరువు మండలం

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం టూవీలర్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..తాడిమర్రి మండలం నాయనపల్లికి చెందిన చిన్న బందు సాహెబ్, చంద్రశేఖర్ బైక్‌పై ధర్మవరం బయలుదేరారు. మార్కెట్‌యార్డు సమీపంలోని దేవాంగ కల్యాణమండపం వద్దనున్న మలుపు వద్ద ట్రాక్టర్ యూటర్న్ చేసుకుంటూ టూవీలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్న బందు సాహెబ్, చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తనకల్లు: మబ్బువారిపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు...మబ్బువారిపల్లికి చెందిన బయారెడ్డి, చిన్నపల్లికి చెందిన శివన్న బైక్‌పై కొక్కంటిక్రాస్‌కు బయలుదేరారు. అయితే గ్రామం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో బయారెడ్డి, శివన్న కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రులను తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికత్స అనంతరం ఇద్దరిని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం


మాట్లాడుతున్న ఐఆర్‌టీ టీచర్ సాయి గణేష్

నల్లమాడ: అమ్మ భవానీ వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ఏటీఎల్ వన్నూరుస్వామి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ వినయ్, ఐఆర్‌టీ ఉపాధ్యాయులు సాయి గణేష్, ఆనంద్ మాట్లాడారు. దివ్యాంగులు ప్రభుత్వం, ఆర్‌డీటీ సంస్థ అందిస్తున్న సహాయ, సహకారాలను అందిపుచ్చుకొని సకాలంగులతో సమానంగా ఆర్థిక పరిపుష్టి సాధించాలని వారు సూచించారు. దివ్యాంగుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సంస్థ ఎస్ఓలు నాగరాజు, గీత, సీఓలు శ్రీనివాసులు, గంగప్ప, నరసింహులు, న్యూ క్రాంతి డిజేబుల్డ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఇంతియాజ్, అమ్మ భవానీ మండల సమాఖ్య అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, రాజగోపాలాచారి, నరసింహులు, మునాఫ్, స్త్రీ శక్తి సభ్యులు జయలక్ష్మి, గంగాదేవి, దివ్యాంగులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో శుక్రవారం క్రీడాకారులను అభినందించారు. గతనెల 24న అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జరిగిన ఎంపికలో పట్టణానికి చెందిన సంజయ్ పురుష సీనియర్ బాస్కెట్‌బాల్ జట్టు, కిరణ్మయి, నిఖ్యశ్రీ మహిళల సీనియర్ బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 7 నుంచి 10 వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టూరు పట్టణంలో రాష్ట్రస్థాయిలో జరిగే 10వ సీనియర్స్ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర పోటీల్లో రాణించి ధర్మవరానికి మంచి పేరు తీసుకు రావాలని అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడ్ హిదయ్‌తుల్లా ఆకాంక్షించారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మెల్యే నిలదీత


ఎమ్మెల్యే, ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: కొట్లపల్లి వద్ద ఉన్న వంగేపేరులో ఇసుకను అక్రమంగా నిత్యం తరలిస్తున్నా పట్టించుకోరా అంటూ జనసేన నాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఆర్డీఓ సువర్ణను నిలదీశారు. శుక్రవారం కొట్లపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ, ఎమ్మెల్యే, తహసీల్దార్ అనుపమ, ప్రత్యేకాధికారి శుభదాస్ హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రసంగం అనంతరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పవన్ తదితరులు లేచి తమ గ్రామానికి సమీపంలో ఉన్న వంగేపేరులో ఇసుకను రాత్రిళ్లు జేసీబీలు ఏర్పాటు చేసి తరలిస్తున్నారన్నారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వంగేపేరు కాజ్‌వేపై పాచి పట్టి ప్రమాదాలు జరుగుతున్నాయని, పలుమార్లు గ్రామస్తులు అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు


నల్లచెరువులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం చిగిచెర్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై 18 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ మంజులాదేవి, ఎండోమెంట్, ఫారెస్ట్ అధికారులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కాలేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ప్రజల స్పందన కరువైంది. ఈసందర్భంగా రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. తన భూమి ఆన్‌లైన్‌లో ఎక్కలేదని అదే గ్రామానికి చెందిన ఉమాపతి, పెండింగ్ జీతం ఇప్పించాలని పారిశుధ్య కార్మికుడు వినతిపత్రం అందజేశాడు. మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: మండలంలోని దాదెంవారిపల్లిలో శుక్రవారం అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 7 ఫిర్యాదులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సదస్సును ఆర్డీఓ వీవీ శర్మ పరిశీలించారు. ఆర్ఐ రామకృష్ణారెడ్డి, వీఆర్ఓ మహేంద్రప్రసాద్, సర్వేయర్ పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం –1లో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూసమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సర్పంచ్ పంచరత్నమ్మ, ఆర్ఐ లక్ష్మిదేవి, వీఆర్ఓలు నీలకంఠరెడ్డి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: శుక్రవారం గౌకనపల్లి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 18 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. ఇన్‌చార్జ్ మండల సర్వేయర్ జిలాని, గ్రామసర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తలుపుల: ఓబులరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ రామానాయక్, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్ఓలు రామచంద్ర, జయప్రకాష్, దివాన్‌వలి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో భూ సమస్యలను విచారించి పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామ పరిధిలో భూ సమస్యలపై 26 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిని విచారించి త్వరగా పరిష్కరిస్తామని అధికారులు వారికి సూచించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, రామగిరి సీఐ శ్రీధర్, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**భూ సమస్యలు పరిష్కరిస్తాం**

కనగానపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ జీ.వీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేసి భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామాల్లో భూ తగాదాలు, భాగపరిష్కారాలు, రెవెన్యూ రికార్డులను తప్పులను సరిదిద్దేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కరుణాకర్, గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: సామచేనుబైలు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై 4 వినతులు అందినట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీసీ కొత్తకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి (58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..గురువారం రాత్రి ధర్మవరం నుంచి సీసీకొత్తకోట గ్రామానికి బైక్‌పై కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి వెళ్తుతుండగా మూడు బావుల క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### డ్రిప్ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం కొత్తచెరువు మార్కెట్ యార్డ్‌లో 3,504 మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 90 శాతం రాయితీతో పరికరాలు అందిస్తున్నామన్నారు. అనంతరం మంత్రి పథకంపై రైతులకు తెలియజేయడంలో విఫలమయ్యారంటూ ఏపీఎంఐపీ పీడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఓ నటరాజ్ పాల్గొన్నారు.

### తపాలా బీమాపై అవగాహన

కదిరి అర్బన్: తపాలా శాఖ ఉద్యోగులు శుక్రవారం పట్టణంలో తపాలా బీమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తపాలా శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన బీమా ఇతర కంపెనీల తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఇస్తుందని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ తెలిపారు. ఆదాయ మినహాయింపు సౌకర్యం ఉందన్నారు.

### అయ్యప్పస్వామి విగ్రహ పోత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి విగ్రహ పోత కార్యక్రమాన్ని గురుస్వామి పిజె విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా 200 కిలోల పంచలోహాలను భక్తుల కళ్లముందే కరిగించి అయ్యప్పస్వామి విగ్రహం ఏర్పాటుకు పోత పోశారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్య బృందం కేరళ డ్రమ్స్ వాయిద్యాలు, అయ్యప్పస్వామి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అయ్యప్పలు భజనలు, కీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో గురుస్వామి సింగారెడ్డి, యర్రప్ప, శివారెడ్డి, రామాచారి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

### బడన్నపల్లిలో పోలీసుల 'పల్లెనిద్ర'

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం బడన్నపల్లిలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామసభను నిర్వహించి ఫ్యాక్షన్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం రాత్రి గ్రామంలోనే బస చేశారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


కదిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ధర్మవరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పుట్టపర్తిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు పలు సంఘాల నాయకులు శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు సంపంగి గోవర్ధన్, నాయకులు బండారు మురళి, గంగాధర్, రవీంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఏపీ పీటీడీ జైభీం అసోసియేషన్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బాబన్న, డిపో గౌరవాధ్యక్షుడు తలుపుల గంగాధర్, ఎస్టీఐ పెద్దన్న, రమణప్ప, ముత్యాలప్ప పాల్గొన్నారు.

తాడిమర్రి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నేత బండారు పెద్దఓబిలేసు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన దళిత నాయకులు, కార్యకర్తలతో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మీసాల కేశవరెడ్డి, బండారు నాగభూషణం, బండారు రామాంజినేయులు, గుజ్జల శ్రీనివాసులు, బీసాని లక్ష్మినారాయణ, ఏజె చిన్ననరసింహుడు, సాకే.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు భరత్, నాయకులు తిరుపాల్, శ్రీనివాసులు, రమణ, సిద్దుగోల్ల బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎద్దుల రాముడు,ఈశ్వరయ్య, నరసింహులు, రాజశేఖర్, సురేంద్ర, మస్తాన్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. ఎస్టీ నాయకులు ఆంజనేయులునాయక్, తిమ్మప్పనాయక్, గోపాల్‌నాయక్, బాలకృష్ణనాయక్, ఎస్సీ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల నరసింహులు, కొండయ్య, బీసీ, మైనార్టీ నాయకులు నాగరాజు, మహమ్మదాలీ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. దళిత సంఘం నాయకులు చిన్నప్ప, శంకర్, పారేసు, చంద్రప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: స్థానిక నాగులకట్ట వద్ద శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎస్సీసెల్ నాయకుడు ఆటోక్రిష్ణా, సీఐటీయూ నాయకుడు నాగరాజు, కిష్ట, అంబేడ్కర్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన అంబేడ్కర్ దేశానికి చేసిన సేవను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ తంగా ఓబుళపతి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, నాయకులు ఫొటోసాయి, ఎస్టీడీ నరశింహులు, నారపరెడ్డి, రమేష్, రవినాయక్, విజయకుమార్‌నాయక్, రామస్వామినాయక్, భాస్కర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లోనున్న అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు చౌడప్ప, దేవరకొండ రమేష్, కుణుతూరు గోపాల్, బడన్నపల్లి నరసింహులు, అజంతా కిష్ట, గుజ్జల బొమ్మన్న, గరుడంపల్లి నారాయణస్వామి, సాకే వెంకటేష్, బుద్దారెడ్డిపల్లి శ్రీనివాసులు, క్రిష్ణమూర్తి, బాబయ్య, రామంజినేయులు, నారాయణ, మల్లికార్జున, నటరాజ్, ఎం.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమడగూరు: స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ వెంకటనారాయణ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం**

కనగానపల్లి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఆశాలను కొనసాగిద్దామని ఎంఆర్‌పీఎస్ రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు సాకే నరసింహులు తెలిపారు. శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు, పలువురు అధికారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎండీ రిజ్వాన్, మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు పోతన్న, ముక్తాపురం మూర్తీ, ఆంజనేయులు, రవి, సూరి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళులర్పించారు.